క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: తీరప్రాంత గ్రామాల్లో ప్రసిద్ధి చెందిన బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రావణమాసం ఆఖరి ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: వాసవిక్లబ్ నరసాపురం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అప్పనప్లాజాలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రసేనగుప్త జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో 20 మంది రక్తం సేకరించారు. రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేసినట్టవుతుందని వక్తలు చెప్పారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు నూలి శ్రీనివాస్, అప్పన బద్రి, కోట్ల బాలకృష్ణ, జల్లూరి శ్రీనివాస్, పద్మనాభుని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పీర్ల పంజాలో మజ్లిస్



పంజాలో మజ్లిస్ సారాంశం వివరిస్తున్న మత గురువు మొహమ్మద్ ఇబ్రహీం

పాలకొల్లు సెంట్రల్: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ కర్బలా పుణ్యభూమిలో వీరమరణం పొందిన సంఘటనను పురస్కరించుకుని ప్రతీ ఏటా నిర్వహించే మొహర్రం సంతాప కార్యక్రమంలో భాగంగా మజ్లిస్ నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని మారుతి సెంటర్ వద్ద బార్గాహె ఇమామ్ హుస్సేన్ (బారా ఇమామ్) పీర్ల పంజాలో మజ్లిస్ ఘనంగా నిర్వహించారు. మత ప్రబోధకులు మౌలానా మొహమ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ కర్బలా పుణ్యభూమిలో హజరత్ ఇమామ్ హుస్సేన్ పరివార సభ్యులు వీరమరణం పొందిన సంఘటనలపై భక్తులకు వివరించారు. మజ్లిస్ అనంతరం మాతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా నగరం, మామిడికుదురు, మొగలికుదురు, అమలాపురం తదితర ప్రాంతాల నుండి వందలాదిమంది ముస్లింలు పాల్గొన్నారు.

తుపాను ప్రభావిత గ్రామాల్లో వైద్య సేవలందించాలి



తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తున్న డి.మహేశ్వరరావు

నరసాపురం రూరల్: తుపాను అధిక వర్షాల కారణంగా ఆయా ప్రాంతాల్లో అనారోగ్య పరిస్థితులు నెలకొనకుండా ఉండేలా సిబ్బంది సేవలందించాలని జిల్లా వైద్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని తూర్పుతాళ్లు పీహెచ్‌సీని సందర్శించారు. జ్వర పీడితులు, మందులు, వ్యాక్సినేషన్ల స్టాకు తదితర వివరాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీ వార్డును సందర్శించిన ఆయన ఆసుపత్రిలో బాలింతరాలు, సహాయకులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుపాను కారణంగా తీరప్రాంత గ్రామాలైన కేపీ పాలెం, పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్‌లలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆయన సందర్శించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి సేవలందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ప్రసాద్, తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బాలుర హాస్టల్ పరిశీలన

కాళ్ల: మండల కేంద్రమైన కాళ్ల ఇంటిగ్రేడ్ బాలుర హాస్టల్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్ నాగార్జున ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి కష్టపడి ఇష్టంగా చదవాలని తెలిపారు. హాస్టల్‌లో అందిస్తున్న భోజనం వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ భోజనాన్ని రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు.

మట్టి గణపతే మహాగణపతి

సిద్ధాంతంలో ఏళ్లుగా మట్టి గణపతి విగ్రహాల తయారీ



సిద్ధాంతంలో మట్టి గణపతి ప్రతిమలను తీర్చిదిద్దుతున్న బుడతయ్య



సిద్ధాంతంలో సిద్ధమైన మట్టి గణపతి విగ్రహాలు

పెనుగొండ: వినాయక చవితి ఉత్సవాలు సమీపిస్తుండడంతో మట్టి ప్రతిమలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గత కొంత కాలంలో పీఓపీ విగ్రహాల వాడకం ఎక్కువగా ఉండడం పర్యావరణానికి ముప్పు వాటిల్లితుండడంతో పర్యావరణ ప్రేమికులు మట్టి ప్రతిమలే మేలంటూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీంతో కొంత మార్పు కనిపిస్తుండడంతో ఏళ్ల తరబడి మట్టి విగ్రహాల తయారీలోనే ఉండిపోయిన కళాకారులకు ప్రోత్సాహం పెరుగుతుంది. ఈ కోవలోనే 40 ఏళ్లకు పైగా మట్టి ప్రతిమలనే తయారు చేస్తూ పర్యావరణ ప్రేమికుడుగా సిద్ధాంతానికి చెందిన కళాకారుడు వీరవాసరపు బుడతయ్య నిలిచాడు. కేవలం మట్టి బొమ్మలను మాత్రమే తయారు చేస్తూ ఆకట్టుకుంటున్నాడు. మట్టి విగ్రహాల తయారీకి శ్రమ అధికంగా ఉన్నా కేవలం వాటినే తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తనవంతు కృషి చేస్తున్నారు. పీఓపీ విగ్రహాల్లా భారీ విగ్రహాలు తయారు చేయడం కష్టంతో కూడిన పనికావడంతో రెండు అడుగుల నుంచి 5 అడుగుల మట్టి ప్రతిమలను తయారు చేస్తున్నారు. వీటిని రూ.1500 నుంచి రూ.8 వేలు వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. కష్టానికి తగిన ప్రతిఫలం రాకపోయినా మట్టి విగ్రహాలనే తయారు చేస్తూ చిత్తశుద్ధిని చాటుకొంటున్నారు. చివరకు రంగులు సైతం పర్యావరణానికి హాని కలిగించని వాటినే ఎన్నుకుని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వీటిని పెనుగొండ, తణుకు, జంగారెడ్డిగూడెం, పాలకొల్లు భీమవరం ప్రాంతాల నిర్వాహకులు తీసుకువెళ్లి చవితి వేడుకలు నిర్వహిస్తారు.

పీఓపీతో పొంచిఉన్న ముప్పు

పీఓపీ విగ్రహాలతో పర్యావరణానికి తీరని ముప్పు వాటిల్లుతుందంటూ పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. ఇవి భూమిలో త్వరగా కరగక, కాలుష్యానికి కారణమై ప్రాణవాయువు స్థాయి తగ్గిస్తుందని వివరించారు. పీఓపీ విగ్రహాలు నీటిలో త్వరగా కరగకపోవడంతో నీటి నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పీఓపీ విగ్రహాలను వదలి మట్టిప్రతిమల వైపు మళ్లి స్థానిక కళాకారులను ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

గుడ్లవల్లేరు సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి



కర్రా జయసరిత

పాలకొల్లు అర్బన్: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో వాష్ రూమ్‌లో కెమెరాలు అమర్చి వీడియోలు తీసిన దోషులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి కర్రా జయసరిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సభ్య సమాజం సిగ్గుపడేలా కళాశాల విద్యార్థినుల వీడియోలు తీసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాల యాజమాన్యానికి టీడీపీ పెద్దలతో స్నేహ సంబంధాలు ఉన్న కారణంగా కేసుని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మహిళలకు రక్షణ కరువైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో దిశ యాప్‌ను పెట్టి ఆడపిల్లలకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కేవలం వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడడంతో వైసీపీ శ్రేణుల ఆస్తులు ధ్వంసం చేయడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని అర్థమవుతుందని పేర్కొన్నారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సంఘటనలు రాష్ట్రంలో మరో చోట జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జయసరిత డిమాండ్ చేశారు.

జాతీయ రహదారిపై పల్టీకొట్టిన కారు

నరసాపురం రూరల్: నరసాపురం–పాలకొల్లు జాతీయ రహదారిలో ఆదివారం రాత్రి ఓ కారు పల్టీలు కొట్టింది. ఈ సంఘటను సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురం నుంచి పాలకొల్లు వైపు వెళుతున్న ఓ కారు నరసాపురం రూరల్ లిమిట్స్‌కు చేరుకోగానే పాత ఇటుక బట్టీ ప్రాంతంలో ముందు వెళ్తున్న బొలేరో వాహనం హఠాత్తుగా పక్కకు తిప్పడంతో వెనుక ఉన్న కారు నడుపుతున్న వ్యక్తి షడన్ బ్రేక్ వేయడంతో కారు పల్టీలు కొట్టి కుడివైపునకు వచ్చి పడింది. ఇదే సమయంలో అటుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. దీంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అయితే ఈ ఘటనపై రూరల్ పోలీసులను వివరణ కోరగా తమకేమీ తెలియదని ఎలాంటి కేసు నమోదు కాలేదని చెప్పారు.

డెంగీ జ్వరాలతో అతలాకుతలం

- పెరుగుతున్న డెంగీ కేసులు
- దోమల వల్లే అంటున్న వైద్యులు



దోమల లార్వాలు వృద్ధి చెందే ప్రాంతాలు



డెంగీ వ్యాధిని వ్యాప్తి చేసే దోమ

పాలకొల్లు అర్బన్: వర్షా కాలంలో మురుగుగుంటల్లో దోమలు విజృంభించడం వలన కలిగే వ్యాధులతో ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతుంటారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా తదితర విష జ్వరాలు విజృంభించి తీవ్ర వ్యాధి గ్రస్తులవుతారు. వేలాది రూపాయలు చేతిచమురు వదిలించుకుంటారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కూడా కోల్పోతుంటారు. అయితే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నివారణకు చర్యలు తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

డెంగీలో ప్లాస్మా లీకేజీ తంటా

డెంగీ సోకితే ప్లేట్‌లెట్లు తగ్గడం కంటే ప్లాస్మా లీకేజీ ఎక్కువ ప్రమాదమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా డెంగీ కేసులు పెరుగుతున్నాయి. డెంగీ వైరస్‌తో రక్త నాళాల్లోని ఎండోథిలియం పొరలో వాపులొచ్చి మధ్యలో ఖాళీలు ఏర్పడతాయి. తద్వారా రక్తంలోని ప్లాస్మా లీకేజీ అవుతుంది. కొందరిలో డెంగీ సంక్లిష్టం కావడానికి ప్లాస్మా లీకేజీ ప్రధాన కారణం. కాళ్లు, కంటి చుట్టూ వాపు, రక్తంలో హెమటోక్రిట్ స్థాయిలు పెరగడం. పల్స్, బీపీ పడిపోవడం, కాళ్లు, చేతులు చల్లబడడం, వాంతులు, కడుపులో తీవ్రమైన నొప్పి తదితర లక్షణాలు కన్పిస్తే ప్లాస్మా లీకేజీగా భావించి అప్రమత్తం కావాలని సూచిస్తున్నారు. ఆలస్యం చేయడం వల్ల హెమరేజిక్ షాక్ సిండ్రోమ్‌కు దారి తీసి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు.

దోమలతోనే ఇబ్బందులన్నీ..

అనాఫిలిస్ దోమ వల్ల మలేరియా వ్యాధిని వ్యాపిస్తుంది. మంచినీటి నిల్వల్లో పెరిగి మలేరియా వ్యాధిని వ్యాప్తి చేస్తాయి. ఇవి మురికివాడలు, చెరువులు, మైనింగ్ ప్రాంతాల్లో వృద్ధి చెందుతాయి. కూలెక్స్ దోమ బోద వ్యాధిని, మెదడు వాపు వ్యాధిని కలుగజేస్తుంది. మురుగునీటి నిల్వల్లో పెరిగే ఈ దోమల వల్ల బోధవ్యాధి, మెదడువాపు వ్యాధులు వ్యాప్తి చేస్తాయి. మురుగు కాలువలు, పందులు తిరిగే అపరిశుభ్ర పరిసరాలు, పంటపొలాల ప్రాంతాల్లో పెరుగుతాయి. ఈడీస్ (ఈజిప్టు) దోమ ఇంటి పరిసరాల్లోని చిన్నచిన్న నీటి నిల్వల్లో పెరిగి, డెంగీ, చికున్ గున్యా వ్యాధులు వ్యాప్తి చేస్తాయి. తాగి పడేసిన కొబ్బరి బొండాలు, నీటి గుంటలు, ఖాళీ సీసాల్లో దోమలు గుడ్లు పెట్టి లార్వాలను వ్యాప్తి చేస్తాయి.

జాగ్రత్తలు పాటించాలి



ఇంటి పరిసరాల్లో మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. కొబ్బరి బొండాలు, ఖాళీ నీటి సీసాలు, రుబ్బురోళ్లల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలి. అలాగే మురుగునీటి గుంటల్లో ఇంజిన్ ఆయిల్ వేయడం వల్ల పొర కట్టి దోమల లార్వాలు చనిపోతాయి. జ్వర పీడితులు అదే రోజు రక్త పరీక్షలు చేయించుకోకుండా నాలుగు, ఐదు రోజులు ఆగి పరీక్షలు చేయించుకోవాలి. అలాగే ఎక్కువ ద్రవ పదార్థాలను తీసుకోవాలి. పీహెచ్‌సీలో డెంగీ పరీక్షలు చేస్తున్నాం. అలాగే వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్, మెడికల్ ఆఫీసర్

4న ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ మాదంశెట్టి పద్మావతి

నరసాపురం: పట్టణంలోని అశ్విని ఆసుపత్రిలో ఈ నెల 4న ఉచిత రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రంధి విజయలక్ష్మి, సత్యనారాయణ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, గైనకాలజిస్ట్‌ల సంఘం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మాదంశెట్టి పద్మావతి చెప్పారు. తమ ట్రస్ట్ ద్వారా గత 15 ఏళ్లుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు రొమ్ము, గర్భాశయ ముఖద్వారా కాన్సర్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందుగా గుర్తించి చికిత్సలు తీసుకుంటే ఉపయోగం ఉంటుందని చెప్పారు. ఈ శిబిరంలో 30 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయస్సు కలిగిన వారు ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చని సూచించారు. పరీక్షలు చేయించుకునేవారు ఈ నెల 3 లోపు 08814-276667 నెంబర్‌కు ఫోన్ చేసి పేరు రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు.

పెనుగొండలో ప్రథమ చికిత్సా శిబిరం



పెనుగొండలో ప్రథమ చికిత్సా శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: భారీ వర్షాలు, విష జ్వరాల నేపథ్యంలో మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పెనుగొండలో ప్రథమ చికిత్సా శిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం పెనుగొండ సచివాలయం5 పరిధిలో శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వర బాధితులకు, ఒళ్లు నొప్పుల బాధితులకు ఉచితం మందులు పంపిణీ చేశారు. వాతావరణ పరిస్థితులు సరిగ్గా లేనందున జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య సిబ్బంది సూచనలు చేసారు. అదేవిధంగా దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిలువల లేకుండా చూసుకోవాలని, టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు లేకుండా చూసుకోవాలన్నారు. వీటి వల్ల దోమల వ్యాప్తి పెరిగి జ్వరాల వ్యాప్తి చెందుతాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దానమ్మ, ఏఎన్ఎం పద్మ, ఆశ వర్కర్ దుర్గభవాని తదితరులు పాల్గొన్నారు.

గడువివ్వండి మహాప్రభో..

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులోని కాలువ గట్టుపై నివసిస్తున్న బాధితుల ఇళ్ల తొలగించేందుకు సమయం ఇవ్వాలని కలెక్టర్ నాగరాణికి బాధితులు మొర పెట్టుకున్నారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆమెకు వినతి పత్రం అందజేసి, గత 50 ఏళ్లుగా ఇక్కడే తరతరాలుగా నివసిస్తున్నామన్నారు. మా ఇళ్లకు పన్ను కట్టించుకుంటున్నారని, విద్యుత్, పైపులున్నాయని, రోడ్లు వేశారని తెలిపారు. మాకు ఇళ్ల స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మించుకునేందుకు సహాయం అందజేస్తే ఖాళీ చేసి వెళ్లిపోతామని, గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ కాలువలను కలుషితం చేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

నీట మునిగిన చేలల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కొప్పర్రులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి జడ్.వెంకటేశ్వరరావు

నరసాపురం రూరల్: రైతులు పంట చేలల్లో నిలిచిన వర్షపు ముంపు నీటిని మళ్లించే ప్రయత్నాలు చేపట్టాలని, అందుకోసం సొంత డీజిల్ ఇంజిన్లు వినియోగించే వారికి ప్రభుత్వం ద్వారా కుపన్లు అందించే ఏర్పాట్లు చేశామని జిల్లా వ్యవసాయ అధికారి జడ్.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కొప్పర్రు, మల్లవరం గ్రామాల్లో గత రెండు రోజులుగా కురుస్తోన్న భారీ వర్షాలకు ముంపు బారిన పడిన పంట చేలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వర్షపు నీరు పోటెత్తి పంట పొలాలను ముంచెత్తిందని, ఆ నీరు సాఫీగా వెళ్లే వీలు లేకపోవడంతో భారీ ఎత్తున చేలల్లో నీరు నిలచి పోవడంతో వరి చేలన్నీ ముంపు బారిన పడ్డాయని రైతులు ఆయన వద్ద ఆవేదన చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. ముంపు నీటిని తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు సొంత డీజిల్ ఇంజిన్లు ద్వారా నీటిని తోడుకునే వారికి ప్రభుత్వం ద్వారా డీజిల్ కూపన్లు ఇచ్చే విధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని, రైతులు సంబంధిత మండల తహసీల్దార్‌ను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ముంపునకు గురైన వరి చేలల్లో నీటిని బయటకు తోడిన వెంటనే తెగుళ్ల నివారణకు సాఫ్ మందును ఎకరానికి 400 గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలని సూచించారు. దీనితోపాటు ఎకరానికి 20కిలోల యూరియా, 20కిలోల పొటాష్ కలిపి చల్లాలన్నారు. గొంతేరు నుంచి కొప్పర్రు వచ్చే మురుగు కాలువ నిర్వహణలో ఉన్న ఇబ్బందులను గుర్తించి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని రైతులకు తెలిపారు. అలాగే ఈ పంట నమోదులో స్తవ సాగుదారుల పేర్లమీద నమోదు చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. వ్యవసాయశాఖ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట వ్యవసాయశాఖ ఏడీ అనిలకుమారి, ఏఓ జాన్సన్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు స్నేహ, లక్ష్మి, వీఆర్‌వోలు, రైతులు నెక్కంటి వెంకట్రావు, పిల్లి కామేశ్వరరావు, పోలిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహణ

నరసాపురం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం నరసాపురం పట్టణంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు రైల్వేస్టేషన్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా స్టీమర్‌రోడ్డు వద్దకు చేరుకుని అక్కడున్న వైఎస్సార్ విగ్రహానికి నివాలులు అర్పిస్తారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ముదునూరి సూచించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని సోమవారం మొగల్తూరులో ఘనంగా నిర్వహించేందుకు నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రమైన మొగల్తూరులోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కుక్కల కృష్ణమోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని యాళ్లవానిగరువు వైఎస్సార్ సీపీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నట్లు కార్యాలయ ప్రతినిధి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్‌లో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారని వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

వీడని ముంపు ముప్పు



మొగల్తూరు ఉన్నతపాఠశాలలో భారీగా నిలిచి ఉన్న వర్షపు నీరు



కొప్పర్రులో చెరువు గట్టుదాటి రోడ్డుపైకి వచ్చిన ముంపు నీరు



ఎల్బీచర్లలో నీట మునిగిన పంట చేలు

నరసాపురం రూరల్: మండలంలో ఆదివారం కూడా వర్షం తీవ్రత కొనసాగడంతో చేలల్లోని ముంపునీరు లాగలేదు. వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో చేలల్లోని ముంపు మరింత పెరిగే అవకాశం ఉందని రైతాంగం వాపోతుంది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులకారణంగా నెలకొన్న పరిస్థితులతో జ్వరపీడితుల సంఖ్య పెరగడంతో తీర ప్రాంత గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. తుపాను ప్రభావం పెరిగితే లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు అవసరమైన తుపాను షెల్టర్లు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే అనువైన ప్రాంతాలను ఆదివారం నరసాపురం తహసీల్దార్ రాజ రాజేశ్వరి పరిశీలించారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాలను కూడా ఆమె పరిశీలించారు. మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణలోని వర్షపు నీరు నిలిచిపోయి ఉంది. కొప్పర్రు గ్రామంలో ప్రధాన రహదారిని ఆనుకుని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన ఉన్న పశువుల చెరువులో అధిక వర్షాలకు నీరు రోడ్డు పైకి చొచ్చుకు వచ్చింది. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఏది చెరువో, రోడ్డో తెలియక నానా అవస్థలు పడుతున్నారు.